# ఐఐటీ-జేఈఈకి వీడ్కోలు!



**ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు కలిగిన ప్రతిష్ఠాత్మక పరీక్ష-ఐఐటీ-జేఈఈ వచ్చే ఏడాది నుంచి కనుమరుగు కాబోతోంది. ఈ నేపథ్యంలో ఐఐటీ ప్రవేశపరీక్ష శిక్షణలో దశాబ్దాల అనుభవమున్న ధాగం కృష్ణమూర్తి స్పందన... సూచనలు!**

ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంచుకోవడం కోసం ఐఐటీలు వేసే తొలి అడుగే ఐఐటీ-జేఈఈ. 2006 వరకూ ఈ పరీక్షకున్న ప్రత్యేకత ఏమిటంటే- ఏ ప్రవేశపరీక్షలోనూ లేనివిధంగా ఇందులో నాన్ ఆబ్జెక్టివ్ ప్రశ్నలుండటం. అంటే విద్యార్థి సమస్య సాధనా విధానాన్ని పరీక్షించే అవకాశం ఉండేది. కానీ విద్యార్థులకపై ఒత్తిడి పెరుగుతోందనే కారణంతో 2006 తర్వాత ఐఐటీ-జేఈఈని పూర్తిస్థాయి ఆబ్జెక్టివ్ పరీక్షగా మార్చేశారు. అప్పటినుంచే ఐఐటీల పతనం ప్రారంభమైందని చెప్పవచ్చు!

కోచింగ్ సెంటర్లను దెబ్బతీయాలనే ఉద్దేశంతో పూర్తిస్థాయి ఆబ్జెక్టివ్ పరీక్షగా మారిస్తే... ఆ నిర్ణయం కోచింగ్ సెంటర్లను పెంచి, ఐఐటీల ప్రమాణాలను దెబ్బతీసే విధంగా ఐఐటీ-జేఈఈని మార్చింది.



## అదృష్టం పాత్ర..!

గత మూడేళ్ళ పరీక్ష పత్రాలను గమనిస్తే ఐఐటీ-జేఈఈ కంటే ఏఐఈఈఈనే మెరుగ్గా ఉందని చెప్పవచ్చు. ఎందుకంటే ఐఐటీ-జేఈఈలో దాదాపు 50 శాతం ప్రశ్నలకు నెగిటివ్ మార్కింగ్ లేదు. అంటే ఊహించి సమాధానం రాసే విద్యార్థులు కూడా అదృష్టం బాగుంటే ర్యాంకు సాధించే అవకాశం ఉంది. కానీ ఏఐఈఈఈలో ప్రతి ప్రశ్నకూ నెగిటివ్ మార్కింగ్ ఉంది. అందుకని ప్రస్తుతం ఉన్న పద్ధతిలో (పూర్తిస్థాయి ఆబ్జెక్టివ్ తరహా పరీక్షగా ఐఐటీ-జేఈఈని కొనసాగించడంలో అర్థం లేదు. ఐఐటీల ప్రత్యేకతను రక్షించి ప్రమాణాలు కాపాడుకోవాలంటే కొన్ని సంవత్సరాల క్రితం ఉన్నట్టుగా స్క్రీనింగ్, మెయిన్స్ అనే రెండంచెల విధానంలో నిర్వహించాలి. మెయిన్స్ పరీక్షలో నాన్ ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలే ఉండాలి.



## శాస్త్రీయ పద్ధతి తప్పనిసరి

ప్రతి వ్యవస్థలోనూ మార్పులూ, సంస్కరణలూ ఉండటం సహజం. ఈ మార్పులు ఆ వ్యవస్థలో భాగస్వాములైనవారితో చర్చించి, ఆలోచించి చేస్తే అవి సంస్కరణలై, వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తాయి. అలా కాకుండా ఏకపక్ష నిర్ణయాలయితే ఆ వ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తాయి. అలా జరగకుండా పరీక్ష విధి విధానాలను రూపొందించడం చాలా అవసరం.

ప్రభుత్వం తలపెట్టిన రెండంచెల ఐఎస్ఈఈఈటీ నిర్వహణ అనివార్యం అనుకుంటే శాస్త్రీయ పద్ధతిలో దీన్ని నిర్వహించాలి.

- ఐఐటీలనూ, మిగతా ఇంజినీరింగ్ కళాశాలలనూ ఒకే గాటన కట్టి ఒకే పరీక్ష ద్వారా ప్రవేశం కల్పించడం ద్వారా ఐఐటీల ఆదరణ, ప్రతిష్ఠ తగ్గిపోతుంది. అందుకని ఐఐటీల్లో ప్రవేశం కోసం రెండు పరీక్షల్లోని మార్కులను, మిగతా ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశం కోసం కేవలం మొదటి పరీక్షలోని మార్కులను పరిగణనలోకి తీసుకోవాలి.
- ఐఐటీల్లో ప్రవేశం కోరుకోని విద్యార్థులను అడ్వాన్స్‌డ్ పరీక్ష నుంచి మినహాయించాలి.
- ఒకసారి నిర్ణయం తీసుకున్న తర్వాత విద్యార్థులు ఆ దిశగా సిద్ధమవుతుంటారు కాబట్టి ఎన్ని ఒత్తిళ్ళు వచ్చినా చివరిక్షణంలో నిర్ణయం మార్చకూడదు.
- ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తయిన విద్యార్థులను మాత్రమే ఈ పరీక్షకు అనుమతించాలి. లేకుంటే ఇంటర్ మొదటి సంవత్సరంలోనే ఈ పరీక్ష రాయాలని చూస్తారు. దానికోసం పదో తరగతి నుంచే- చదవాల్సిన సబ్జెక్టులను వదిలేసి- లాజికల్ రీజనింగ్, జనరల్ ఆప్టిట్యూడ్‌లలో శిక్షణ తీసుకోవడం మొదలుపెడతారు.
- ఇంటర్ పరీక్షా విధానంలో సమూలమైన మార్పులు చేసిన తర్వాతే ఇంటర్ మార్కుల వెయిటేజి గురించి ఆలోచించడం మంచిది.

ఐఐటీల ప్రత్యేకతను రక్షించి మన విద్యాప్రమాణాలు కాపాడుకోవాలనుకుంటే- పరీక్ష విషయంలో తుది నిర్ణయం పూర్తి వివరాలతో త్వరగా ప్రకటించాలి. విద్యార్థులు సంసిద్ధులవడానికి తగినంత సమయం ఇవ్వాల్సిన బాధ్యత, విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో ఉన్న ఆందోళనను తొలగించాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వానిదే!